ప్రజాశక్తి

బుధవారం 11 జూన్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ వెంకటమురళి

పేదల వైద్యానికి పెద్దపీట

4లో

పనుల్లేక ఇబ్బందులు పడుతున్నాం..

- వ్యవసాయ సీజన్‌లోనే పనులు దొరుకుతున్నాయి..
- 'ఉపాధి' కూలి సరిగ్గా పడటం లేదు..
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఎదుట కూలీల ఆవేదన

కూలీల సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

వ్యవసాయ సీజన్‌లో మాత్రమే పనులు దొరుకుతున్నాయని, మిగిలిన రోజులలో పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని వ్యవసాయ కూలీలు తమ సమస్యలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు దృష్టికి తీసుకొచ్చారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థిక పరిస్థితులు, పనులు, పథకాల అమలు తదితర పరిస్థితులను తెలుసుకోవడానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం నాడు మండలంలోని మైనంపాడు 2లో

బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు

ఆందోళనకు గురైన ప్రయాణికులు

3లో

నేడు జగన్ రాక..

- పొదిలిలో పొగాకు వేలం కేంద్రం సందర్శన
- రైతులతో ముఖాముఖి..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నాడు పొదిలికి రానున్నారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఈ సమస్యపై పార్టీ తరపున దృష్టి సారించారు. గత నెలలోనే రావాల్సి ఉన్నందున వాతావరణం అనుకూలించనందున వాయిదా పడింది. పొగాకు సంక్షోభం కొనసాగుతున్నందున ఇప్పుడు ఆయన వస్తున్నారు. వారం రోజులుగా పార్టీ 2లో

మద్యం అక్రమ విక్రయాలు నిర్మూలించాలి..

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మద్యం అక్రమ విక్రయాలు, నాటు సారా నిర్మూలించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. నాటు సారా నిర్మూలనపై నవోదయం 2.0 అవగాహన కార్యక్రమాలపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. నాటు సారా తయారీని అధికారులు పూర్తి స్థాయిలో అరికట్టాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. మద్యం అక్రమ విక్రయాలు జరిగితే చర్యలు తీసుకోవాలన్నారు. గోవా నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న మద్యంను అరికట్టాలని సూచించారు. చాక్లెట్లు, ద్రవపదార్థాల రూపంలో గంజాయి విక్రయాలు జరిగితే సహించేది లేదన్నారు. చీరాల మండలంలో తొమ్మిది గ్రామాలు, నగరం మండలంలో ఐదు గ్రామాలు, బాపట్ల మండలంలో రెండు గ్రామాలు, రేపల్లె మండలాలలో ఒక గ్రామంలో నాటుసారా ఉత్పత్తులు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. 17 గ్రామాలలో 65 కుటుంబాలు రహస్యంగా నాటు సారా ఉత్పత్తి చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటికే గడిచిన నాలుగు నెలలలో 43 కేసులు నమోదయ్యాయని, 29 మందిని అరెస్టు చేశామన్నారు. ఆ కుటుంబాల వారిని వత్తి నుంచి మాన్పించేందుకు విస్తతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆ కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాల వారికి పునరావాసం కల్పించి, డి అడిక్షన్ సెంటర్ల ద్వారా వైద్యం అందించాలన్నారు. ప్రజలలోనూ చైతన్యం తీసుకురావాలన్నారు. నాటు సారా ఉత్పత్తులను బాపట్లలో పూర్తిగా అరికట్టడానికి మండల, గ్రామస్థాయిలో కమిటీలు నియమించామన్నారు. ఈ కమిటీలు అత్యంత చురుగ్గా పనిచేయాలని మార్గనిర్దేశం చేశారు. మహిళా పోలీసులు, సచివాలయాల సిబ్బందిని కమిటీలలో చేర్చాలన్నారు. కళాజాతా బృందాలతో విస్తతమైన అవగాహన కార్యక్రమాలు ప్రజలలో నిర్వహించాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు లభిస్తాయన్నారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ కమిషనర్ హేమంత్ నాగరాజు, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి బి వెంకటేశ్వ ర్లు, బాపట్ల, రేపల్లె, చీరాల ఆర్‌డివోలు పి గ్లోరియా, ఎన్ రామలక్ష్మి, చంద్రశేఖర నాయుడు, డిఆర్‌డిఎ పీడి కె శ్రీనివాస రావు, డిపివో కెఎల్ ప్రభాకర్, కమిటీ లోని వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

పనుల్లేక ఇబ్బందులు పడుతున్నాం..

(మొదటిపేజీ తరువాయి)

గ్రామానికి విచ్చేశారు. ఆయన మొదటగా గ్రామంలోని దళిత కాలనీలలో పర్యటించి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల ప్రజలు తమ సమస్యలను శ్రీనివాసరావు దృష్టికి తెచ్చారు. అసంఘటిత కార్మికులుగా ఉన్న కొద్దిమందికి మాత్రమే కొద్దిరోజులు పనులు దొరుకుతున్నట్లు వారు తెలిపారు. చాలాకాలంగా తమ కాలనీలలో ఇళ్ల స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గత వైసిపి ప్రభుత్వ కాలంలో నివాసయోగ్యం కాని స్థలాలను ఇంటి స్థలాలుగా ఇచ్చారని, అయినా వాటిలోకి ఇప్పటికీ ఎవరూ వెళ్లలేదని తెలిపారు. గ్రామంలో చాలా కాలంగా నివాసముంటున్న తమకు ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వలేదని ఎస్టీ కాలనీవాసులు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస కార్మికులు రావడంతో అసంఘటిత రంగంలో కూడా పనులు బాగా తగ్గిపోయాయని దళిత కాలనీవాసులు తెలిపారు.

అనంతరం వి.శ్రీనివాసరావు ఉపాధి పనులు చేస్తున్న వారి వద్దకు వెళ్లి ఉపాధి పనులను పరిశీలించారు. వారి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనుల్లో కూలి సరిగ్గా పడటం లేదని వారు ఆయన దృష్టికి తెచ్చారు. పే స్లిప్పులు కూడా ఇవ్వడం లేదన్నారు. పని దినాలు తగ్గుతున్నాయని తెలిపారు. గత ఏప్రిల్ నుండి ఇప్పటివరకు పనిచేసిన వాటికి బిల్లులు ఇవ్వలేదన్నారు. పని పూర్తయిన తరువాత హాజరు కోసం సుమారు గంటన్నర సేపు ఎండలో నిలబడాల్సి వస్తుందని తెలిపారు. పని ప్రాంతంలో మంచినీటిని కూడా ఏర్పాటు చేయడం లేదని పేర్కొన్నారు.

ఉపాధి హామీకి కేంద్రం నిధులు పెంచాలి..

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ఉపాధి హామీకి కేంద్రం నిధులను పెంచాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని మైనంపాడులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీకి నిధులలో కేంద్రం కోత విధిస్తోందన్నారు. దాని ఫలితంగానే పని దినాలు తగ్గిపోతున్నాయని అన్నారు. సంవత్సరానికి 200 రోజులు పనిదినాలు కల్పించాలని, రోజుకి 600 రూపాయల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలు నిర్మించుకునే గహాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని, అర్హులైన వారందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, బంకా సుబ్బారావు, మండల కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు అబ్బూరి వెంకటేశ్వర్లు, అద్దంకి భగత్‌సింగ్, కరిచేటి హనుమంతరావు, గుండవరపు సుబ్బారావు, షేక్ కమాల్, గ్రామాభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ రెబ్బవరపు శీతారామయ్య పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ అవిశ్వాస ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణపై అవిశ్వాస సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు శ్రీ పొట్టి శ్రీరాములు కౌన్సిల్ హాలులో జరుగుతుందని కమిషనర్ డివిఎస్ నారాయణరావు మంగళవారం తెలిపారు.

'కూటమి' మహిళల నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజా రాజధాని అమరావతి మహిళలను కించపర్చిన వైసిపి నాయకులు, సాక్షి ప్రతినిధులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కూటమి మహిళలు డిమాండ్ చేశారు. సాక్షి పత్రిక, టివి చానల్ ప్రసారాల్లో కోట్లాది ప్రజలను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేసిన సాక్షి ప్రతినిధులు, వాటిని ప్రోత్సహించిన సాక్షి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కూటమి మహిళలు ఒంగోలు నగరంలో చర్చి సెంటర్ నుండి అద్దంకి బస్టాండ్ ఎన్టీఆర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. జగన్ చిత్రపటాలను మహిళలు తగలబెట్టి వారి నిరసనను తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు రావుల పద్మజ, మండవ లావణ్య, ఆర్ల వెంకటరత్నం, టి.అనంతమ్మ, నాళం నరసమ్మ, కె.కుసుమ కుమారి, పసుపులేటి సునీత జనసేన పార్టీ మహిళలు బొందిలి శ్రీదేవి, ప్రమీల పాల్గొన్నారు.

నేడు వైఎస్ జగన్ రాక

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పార్టీ నేతలు జగన్ పర్యటనపై దృష్టి సారించారు. పొదిలికి హెలికాప్టర్‌లో ఆయన చేరుకొని.. పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శిస్తారు. కొనుగోళ్లను పరిశీలిస్తారు. పొగాకు రైతులతో మాట్లాడతారు. పార్టీ తరపున అన్ని ఏర్పాట్లూ చేశారు. ఎన్నికల తర్వాత జగన్‌కు జిల్లాలో ఇదే మొదటిసారి పర్యటనగా ఉంది. దీంతో పార్టీ నేతలు ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు పూర్తిస్థాయిలో కసరత్తు చేశారు.

పొగాకు రైతుల్లో ధరల్లేక అసంతృప్తి ఉంది. దీన్ని గుర్తించిన నేతలు ఆ దిశగా దృష్టి సారించారు. వేలం కేంద్రాలను సందర్శించారు. ఈ సమస్యను తీసుకొని పార్టీ తరపున ఆందోళనకు ఎజెండాగా ఖరారు చేశారు. వాస్తవానికి ధరల్లోనూ మార్పులేదు. మంత్రులు సందర్శించినప్పటికీ వ్యాపారుల ధోరణి మారలేదు. ధరల్లో సంక్షోభం కొనసాగుతోంది. సగటు ధర కూడా రోజురోజుకూ పడిపోతోంది. ప్రస్తుతం రూ.254 కొనసాగుతోంది. గరిష్ట ధర కూడా రూ.280కి మించడం లేదు. రైతులు రోడ్లెక్కుతున్నారు. వ్యాపారులతో భేటీలు ప్రశ్నార్థకంగామారాయి. ప్రభుత్వం నుంచి కూడా ఎటువంటి చర్యలు లేవు. వేలంలో పోటీ కనిపించడం లేదు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేశంతోనే పోటీ పెరుగుతుందని రైతులు భావిస్తున్నా ఆ దిశగా చర్యలు లేవు. ప్రభుత్వ రంగ సంస్థలతో పొగాకు కొనుగోళ్ల చేయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కూడా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇన్ని రకాలుగా రైతుల పక్షాన ఒత్తిళ్లు చేస్తున్నా ప్రభుత్వం నుంచి చలనం లేదు. రాజకీయ పార్టీలు, రైతుసంఘాల డిమాండ్లపై కదలిక కనిపించడం లేదు. వ్యాపారుల్లోనూ మార్పులేదు. రోజురోజుకూ మార్కెట్ ఆందోళన దిశగా సాగుతోంది. వేలంలో రోజూ 25 శాతం బేళ్లను తిరస్కరిస్తున్నారు. బోర్డు వైపు నుంచీ గ్రేడ్లను నిర్ణయించడంలోనూ పక్షపాతం ప్రదర్శిస్తున్నారని రైతులు చెబుతున్నారు. నాణ్యమైన పొగాకును కూడా తక్కువ గ్రేడుగా చూపుతున్నారని, దీని వల్ల వ్యాపారులకు మేలు జరుగుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. పొగాకు బోర్డు అధికారులు వేలంలో ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారనే విమర్శలూ ఉన్నాయి. మరో వైపు పాలకపక్ష నేతలు కూడా ఈ సమస్యపై దృష్టి సారించడం లేదు. రాజకీయ కోణంలో ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తున్నారే తప్ప ధరలు పెరిగే మార్గం ఆలోచించడం లేదు. బర్లీ పొగాకు విషయంలో ప్రభుత్వం వైపు నుంచి కొంత ఊరట కలిగింది. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించారు. ఐటీసీ, జీపిఐలతో పాటు చిన్నవ్యాపారులు కలిపి 45 మిలియన్లు కొనాలని లక్ష్యం పెట్టారు. మిగిలిన బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో అక్కడ సమస్యకు కొంత పరిష్కారం చూపారు. వర్జీనియా పొగాకు వేలంలో పరిస్థితి యథాతథంగా కొనసాగుతోంది. ఎటువంటి ప్రత్యామ్నాయ చర్యలూ కనిపించడం లేదు. సమాఖ్యను గానీ, ఎస్టీసీని గానీ రంగంలోకి దించితే తప్ప ధరల్లో మార్పు రాదు. అయితే రెండు నెలలుగా కాలయాపన చేస్తున్నారు. ఫలితంగా రైతుల నుంచి కారుచౌకగా పొగాకును వ్యాపారులు లాగేస్తున్నారు. ఇప్పటికే రైతుల నుంచి నాణ్యమైన పొగాకు అంతా కొనేశారు. లోగ్రేడు ఎక్కువగా వస్తోంది. దీనికి ధరల్లేవు. ఫలితంగా సగటు ధర దిగజారుతోంది. ఏదేమైనప్పటికీ వర్జీనియా పొగాకు రైతులు నష్టాలపాలవుతున్నారన్నది సుస్పష్టం. ప్రభుత్వం నుంచి ఎటువంటి చర్యలు లేనందున వైసిపికి కూడా ఇదొక అస్త్రంగా కనిపించింది. ఈ అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకున్నారు. వైసిపి అధినేత జగన్ దృష్టికి తీసుకుపోయారు. రైతుల్లో పార్టీకి ఆదరణ పెరుగుతుందని భావించారు. ఆయన వేలం కేంద్రానికి వచ్చేలా జిల్లా నేతలు ప్రయత్నాలు చేశారు. బుధశారం నాడు జగన్ పొదిలికి వస్తున్నారు. రైతులతో పాటు పార్టీ శ్రేణులు భారీగా కదిలేలా జిల్లా నేతలు ఏర్పాట్లు చేశారు.

PASSPORT LOST

I, **Marriboyina Venkatadri,** S/o **Venkateswarlu,** R/o. 2nd line gopal Nagar Ongole, lost my passport (**No. B3188827**) on 7th June2025 near a Xerox Centre in gopal Nagar Ongole, If found, please contact: **9634396189.**

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS, AT VIJAYAWADA
A.C.P. No. 200/2023

Between:-
KAPIL CHITS (KOSTA) PVT. LTD. Represented by its Zonal Legal Officer .Governorpeta Branch, Vijayawada. ...Disputant

AND

Kata Bala Krishna & Others ...Opponents

Notice to Opponents 1, 2 & 6

1. Kata Bala Krishna, S/o. Malyadri, R/o. D. No: 6-48, Ponnaluru, Cherukuru Mandal, Prakasam District. (Opponent No.1)
2. Ganipinenie Rama Krishna, S/o. Venkaiah, R/o. H. No. 9-120, Karavadi, Ongole Mandal, Prakasam District. (Opponent No. 2)
3. Kata Malyadri, S/o. Chencu Ramaiah, R/o. D. No: 6-48, Ponnaluru, Cherukuru Mandal, Prakasam District. (Opponent No. 6)

Please take notice that the above Claim Petition had filed for recovery of claim amount and the Honourable Deputy Chit Registrar ordered notice to all of you and posted the case to 20-06-2025 for your appearance. So all of you are here by requested to appear before the office of Deputy Registrar of Chits Vijayawada, D. No. 55-6-7A, Opposite to Priya Childeren Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada-520010 on **20-06-2025** at **10-30** A.M. in person or through your Advocate, failing which the matter will be decided in your absence.

(By order of the Honourable Deputy Registrar of Chits)

Hearing Date: 20-06-2025

A. Prasoon Kumar, Advocate Vijayawada

CHANGE OF NAME

I, **MERUGUMOLU PRAVEEN KUMAR** (Old Name), S/o **MERUGUMOLU PRASAD RAO,** resident of D.No.51-1-199, Kabadipalem, Railway Station Road, Ongole, Prakasam District, Andhra Pradesh-523001, India, I, have Changed my name as **MERUGUMOLU CHIRANJEEVI** (New Name) S/o **MERUGUMOLU PRASAD RAO,** Hereafter my name is known as **MERUGUMOLU CHIRANJEEVI** (New Name) S/o **MERUGUMOLU PRASAD RAO,**

CHANGE OF DATE OF BIRTH

I, **THOTA ASWINI** wife of No. **15181944A,** HAV: **THOTA GURAPPA ,** R/o, G Venkatapuram Village, Rajupalem Post, Komarolu - Mandal, Prakasam District, Andhra Pradesh, do hereby declare that I modified wrong Date of Birth from **11-09-1994** to **25-06-1993.** vide affidavit sworn before Shaik Yasin Basha, Giddalur, notary public on Dated **09-06-2025.**

NOTICE

IN THE COURT OF THE VI ADDL DIST. JUDGE :: BAPATLA
I.A. No. 199 /2023 in O.S.No. 29 / 2018

Between:
Dupati Siva Nagendram **...Petitioner/Plaintiff**
And
Khagga Sitaravamma & Others **...Respondents/Defendants**

To,
R-4:Kurra Naga Sushma, D/o. Kurra Anil, W/o.Muppalaneni Rajendra Prasad, R/o Door No.1-44, Appikatla Village, Bapatla Mandal, Bapatla District.

పైనెంబరు దావాలోని ఐ.ఏలో 4వ రెస్పాండెంట్ అయిన మీకు నోటీసు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియజేయమని కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున పైనఉదహరించిన 4వ రెస్పాండెంటు **ది.30-06-2025**న **ఉ॥గం॥10-30ని॥**లకు పై కోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలసినది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

యస్. ఏడుకొండలు, బి. బాజి
పిటీషనరు/వాది తరపు అడ్వకేట్స్, గుంటూరు, సెల్: 98493 73199

మహారాజశ్రీ పర్చూరు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

EP 36/2024
in
OS 47/2022

Between :-
పెండేటి శీతారామయ్య ....DHR

V/s

(1) శీలం సుశీల...1వ JDR Exparty
(2) శీలం మార్కండేయులు....2వ JDR Exparty
(3) శీలం అరుణ కుమార్ (ఉరఫ్) కుమార్ 3వ JDR Exparty
(4) శీలం పున్నయ్య S/o late మార్కు 4వ JDR

వీరందరి నివాసం సూదివారి పాలెం (Po) ఇంకొల్లు (Mandal). పర్చూరు కోర్టు పరిధి

పై నంబరు EPని DHR తరువున కోర్టు వారి ఎదుట పైతెలిపినవారిని JDR లుగా పొందు పర్చి EP దాఖలు పర్చగా దరిమిలా శ్రీ కోర్టు వారు సదరు విషయమై 4వ JDRకు అనేక పర్యాయములు, కోర్టు (ప్రొసెస్ సర్వరు ద్వారా మరియు పోస్టు ద్వారా సమను (నోటీసు) పంపించిననూ 4వ JDR తీసుకొనకుండా కాలయాపన చేయుచుండగాశ్రీ కోర్టు వారు 4వ JDRకు ఈపేపర్ ప్రకటన ద్వారా నోటిసులు (సమన్స్) జారి చేయమని ఆర్డర్ వేసినారు కావున సదరు విషయమై వాయిదాది27-06-2025న ఉదయం గం.10.30 నిమిషములకు శ్రీకోర్టు వారి ఎదుట 4వ JDR అయిన నీవు స్వయముగా కాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది గా లేని ఎడల మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానము చేయు దరని తెలియపరచడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం //

ఇట్లు
కట్టా సాల్మన్
పంబి కిషోర్ రెడ్డి
అద్వకేట్స్, పర్చూరు.

ఉపాధి బకాయిలు వెంటనే విడుదల చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-టంగుటూరు

ఉపాధి హామీలో పని చేస్తున్న కూలీలకు వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం కొనిజేడులోని ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కూలీలు గత 12 వారాలుగా తమకు వేతనాలు రాలేదని, ఎలా బ్రతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి చట్టం ప్రకారం పనిచేసిన 15 రోజుల్లో వేతనాలు ఇవ్వాలన్నారు. ఆలస్యమైతే వడ్డీతో కలిపి ఇవ్వాలని చట్టం చెబుతుందన్నారు. కష్టజీవుల పట్ల పాలకులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గం అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపాధి హామీ కూలీల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎండలు తీవ్రంగా మండుతున్నాయని, వేసవి తీవ్రతకు వడదెబ్బ తగిలి కూలీలు ప్రమాదానికి గురి అయ్యే అవకాశం ఉందని అన్నారు. ఈ సందర్భంలో ఉపాధి కూలీలు పనిచేసే ప్రాంతంలో నీడకు పట్టలు, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు లాంటివి ప్రభుత్వం

నిరసన తెలుపుతున్న నాయకులు, కూలీలు

గతంలో కల్పించారని, ఇప్పుడు కూడా అటువంటి ఏర్పాటు చేయాలని కోరారు. వేసవికాలంలో పనిచేసినందుకు ఉపాధి కూలీలకు ప్రత్యేకంగా సమ్మర్ అలవెన్స్ ఇచ్చే వారిని అటువంటి సౌకర్యం కల్పించాలని కోరారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వి.మోజెస్ మాట్లాడుతూ గ్రామాల్లో తగిన పనులు దొరక్క వలసపోయి తిరిగి వచ్చిన వారికి జాబ్ కార్డులు తొలగించారని, అందరికీ కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు ఎస్.కె మీరాస్ పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: హనుమంతునిపాడు మండలం హాజీపురం గ్రామ పరిధిలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో గత తొమ్మిది వారాలుగా కూలీలు అందక కార్మికులు అర్ధాకలితో పనులు చేస్తున్నారని వెంటనే బిల్లులు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. ఉపాధి హామీ చట్టంలో నిబంధనలను ప్రభుత్వమే తుంగలోకి తొక్కుతుందని ఆరోపించారు. పని చేసిన ప్రతికూలీకి వారంలో చివర రోజు బిల్లు ఇవ్వాలని చట్టం చెబుతుంటే గత మూడు నెలలుగా కూలీలతో పని చేయించుకుంటూ బిల్లులు చెల్లించకపోవడం అత్యంత దారుణమన్నారు. కూలీలకు పని ఇచ్చి చేసిన పనికి డబ్బులు ఇవ్వకపోతే ఏం తిని బ్రతకాలని ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దలు తమకు సంబంధం లేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని కూలీల పట్ల దుర్మార్గమైన వివక్షను ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ప్రతి జాబ్ కార్డుదారునికి 200 రోజులు పనివ్వాలని ప్రభుత్వమే ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం ఉపాధి కార్మికులందరికీ కల్పించాలని నినదించారు. మేట్లకు అదనపు పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మేట్ల వ్యవస్థను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తీవ్రమైన ఎండల్లో పని చేస్తున్న కూలీలకు సమ్మర్ అలవెన్స్, మజ్జిగ, మంచి నీళ్లు, ట్రావెల్ అలవెన్స్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మేట్లు మన్నెం ప్రసాద్, గాయం రమేష్, సూరసాని సుబ్బా రెడ్డి, చిట్యాల ఆదిరెడ్డి, చిట్యాల తిరుపతయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ధారా రాజేష్ తోపాటు కూలీలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శివారు కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

పేదలు నివాసం ఉండే శివారు కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. కనిగిరి మున్సిపాలిటీ రెండో వార్డు పరిధిలోని శివనగర్ కాలనీ, ఎన్జీవో కాలనీ, బొగ్గుల గొంది కాలనీలలో ఎమ్మెల్యే మంగళవారం ఉదయం పర్యటించారు. డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉండటంతో మెరుగుపరిచేందుకు తగిన చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వార్డులలో కెఎస్ఎస్ సభ్యులు ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు. కెఎస్ఎస్ సభ్యులు వార్డులలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని వాటిని అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. వార్డులలో తాను పర్యటించేటప్పుడు కెఎస్ఎస్ సభ్యులు మాత్రమే ఉంటే సరిపోతుందని తెలిపారు. షో చేసేందుకు తాను వార్డులలో పర్యటించటం లేదని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు పర్యటిస్తున్నట్లు తెలిపారు. వాగు కాలువలను ఆక్రమించిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఆక్రమణల తొలగింపు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అవసరమైనచోట కల్వర్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక ప్రణాళిక ప్రకారం మొదటి విడతగా రెండో వార్డులో సైడ్ కాలువలు ఏర్పాటు చేయాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఉన్న వెంకటేశ్వర థియేటర్‌ను శుభ్రంగా ఉంచుకునేలా యజమానులకు నోటీసులు ఇవ్వాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. థియేటర్ యజమానులు స్పందించకపోతే మున్సిపల్ సిబ్బంది చేత శుభ్రం చేయించి ఆ ఖర్చును ట్యాక్స్ రూపంలో వసూలు చేయాలని ఆదేశించారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను అందజేయాలని సూచించారు. వీధిలైట్లు, పెన్షన్లు, సైడు కాలువలు వంటి సమస్యలను

శివనగర్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసెఫ్, ఏఈ మాధవరావు, సానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్, టిడిపి పట్టణ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాస్ రెడ్డి, వార్డు అధ్యక్షులు రావర్ల వెంకట నారాయణ, బూత్ ఇన్‌ఛార్జి ఈదర రవికుమార్, స్థానిక నాయకులు కనిగిరి మనోహర్‌రావు, పచ్చవ చంద్రశేఖర్, ఉదయగిరి బాల చెన్నయ్య, చింతలపూడి వాసుదేవరావు, గడిఎముల నారాయణ, పాలూరి సత్యం, కొబ్బరి బోండాల సుబ్బారావు, కేశవ, కరిముల్లా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వర కుమార్

ఓటర్ల జాబితాకు సహకరించాలి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్

ప్రజాశక్తి-చీమకుర్తి

ఓటర్ల జాబితా తయారీకి అందరూ సహకరించాలని నియోజకవర్గం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మరియు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహశీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వర కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆధార్ సీడింగు, నూతన ఓటర్ల చేర్పు, సవరణలు, తొలగింపులపై వివిధ రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు బిఎల్ఓలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్లు ఆర్.బ్రహ్మయ్య, ప్రవీణ్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు గొల్లపూడి సుబ్బారావు, పమిడి వెంకటేశ్వర్లు, తాతినేని శ్రీరామ్, దరిమడుగు నాగరాజు, తుమ్మల సుబ్బారావు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో స్వర్ణ రమణయ్య ప్రతిభ

జిల్లాస్థాయిలో మొదటి స్థానం

ప్రజాశక్తి-పీసీపల్లి

యోగా పోటీల్లో ఉపాధ్యాయుడు స్వర్ణ రమణయ్య జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. మంగళవారం యోగాంధ్రలో భాగంగా ఒంగోలులోని మినీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో ఉపాధ్యాయుడు స్వర్ణ రమణయ్య ఆసనాలు, సూర్యనమస్కారాలులో 35 సంవత్సరాలు పైన విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. స్వర్ణ రమణయ్యను జేసీ గోపాలకృష్ణ, స్టెప్ సిఇఒ శ్రీమన్నారాయణ, యోగాచార్యులు సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ హనుమంతరావు, డిప్యూటీ ఎంపిడిఓ రాంప్రసాద్, ఎంఇఓలు జి.సంజీవ్, ఆర్.శ్రీనివాసులు, నారాయణరెడ్డి, రామిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

యోగాసనాలు వేస్తున్న స్వర్ణ రమణయ్య

బెంగుళూరు ఎక్స్‌ప్రెక్స్ రైలులో మంటలు

ఆందోళనకు గురైన ప్రయాణికులు

ప్రజాశక్తి-చీరాల

బీహార్ నుంచి బెంగుళూరు వెళ్తున్న బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ రైలు ఎస్-2 బోగీలో స్వల్ప మంటలు వ్యాపించిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. చీరాల సమీపంలోని కారంచేడు వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... బీహార్ నుంచి బెంగుళూరు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో ఎస్-2 బోగి వద్ద బ్రేక్ బైడింగ్ కావడంతో దట్టమైన పొగ వచ్చి స్వల్పంగా మంటలు చెలరేగాయి. ఈ మంటలను గమనించిన ప్రయాణికులు చైన్ లాగి రైలును నిలిపి దిగి పరుగులు తీశారు. స్పందించిన రైల్వే ఎఎస్ఐ రమేష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ మూర్తి ఘటనా స్థలానికి చేరుకొని రైల్వే నిపుణుల సాయంతో మంటలు రావడానికి గల కారణాలపై పరిశీలించారు. బ్రేక్ బైడింగ్ వల్ల పొగ, మంటలు వచ్చినట్లుగా నిర్ధారణకు వచ్చారు. అరగంట సేపు ట్రైన్ కారంచేడు గేటు వద్దే నిలిపింది.

రైలు నుంచి దిగుతున్న ప్రయాణికులు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-సంతనూతలపాడు

వెంకటేశ్ మృతదేహం

మనస్పర్ధలతో చెరువులోకి దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలోని సంతనూతలపాడు పోలీస్ స్టేషన్ సమీపంలో సోమవారం జరగ్గా మంగళవారం వెలుగులోకి వచ్చింది. తెలిసిన వివరాల మేరకు.. చీమకుర్తి పట్టణంలోని కోటకట్టవారి వీధిలో నివాసం ఉంటున్న నేరెళ్ల చిన్న నాగ వెంకటేష్(24) ప్రస్తుతం ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. దుకాణం ఏర్పాటు చేసుకునే క్రమంలో కుటుంబ సభ్యులతో మనస్పర్ధలు ఏర్పడ్డాయి. ఈ నెల 9వ తేదీన ఆరోగ్యం సరిగా లేదని ఒంగోలు వెళ్లి వచ్చాడు. సోమవారం సంతనూతలపాడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా ఎలాంటి గాయాలు లేవు. పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలులోని రిమ్స్‌కు తరలించారు. ఎఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోటీలు తిలకిస్తున్న జనం

రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి-సింగరాయకొండ

సింగరాయకొండ మండలం పాత సింగరాయకొండ శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ప్రారంభమయ్యాయి. టీడీపీ నాయకులు జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. పోటీలు తిల కించేందుకు వేలాదిమంది తరలివచ్చారు. ఎస్ఐ బి మహేంద్ర ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు. విజేతలకు టిడిపి అధ్యక్షులు వేల్పుల సింగయ్య రూ.70 వేలు, గంజి ప్రసాదు రూ.50 వేలు, బాపట్ల బ్రదర్స్ రూ.40 వేలు, మించల సింగయ్య, నక్క బ్రహ్మయ్య రూ.30 వేలు, చెమట మాధవ రూ.20 వేలు, మద్దసాని తాతయ్య రూ.12 వేలు బహుమతులుగా ఇవ్వనున్నారు.

ఉత్తమ విద్యార్థులకు విమానయానం

పూర్వ విద్యార్థి నాగేశ్వరరావు ప్రోత్సాహం

ప్రజాశక్తి-దొనకొండ

పదో తరగతి ఫలితాల్లో మంచి ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థులకు విమాన ప్రయాణంతో పాటు హైదరాబాద్‌లోని చారిత్రాత్మక ప్రదేశాలు సందర్శించే అవకాశం కల్పించారు పూర్వపు విద్యార్థి మాడిశెట్టి నాగేశ్వరరావు. దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1981 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థి మాడిశెట్టి నాగేశ్వరావు 2025 సంవత్సరం పదవ తరగతిలో పాఠశాల స్థాయిలో టాపర్లుగా నిలచిన ఇద్దరు విద్యార్థులకు విమా న ప్రయాణంతో పాటు హైదరాబాద్‌లోని అన్నీ ప్రదేశాలను స్వంత ఖర్చులతో చూపిస్తానని ప్రధానోపాధ్యాయు డికి హామీ ఇచ్చారు. జి కోటేష్, శరత్‌నాయక్‌లు మంచి మార్కులు సాధించారు. ఈ నేపథ్యంలో ఇచ్చిన హామీ మేరకు హెచ్ఎం రామాంజనేయులుతో కలిసి రెండురోజులు హైదరాబాద్‌లోని ప్రాముఖ్యమైన అన్నీ ప్రదేశాలను చూపించి విమాన ప్రయాణం చేయించారు. నాగేశ్వర రావు ఇచ్చిన ప్రోత్సాహం విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందేందుకు ఎంతో దోహదపడుతుందని హెచ్ఎం తెలిపారు. నాగేశ్వరరావును అభినందించారు.

విద్యార్థులతో హెచ్ఎం రామాంజనేయులు

పేదల వైద్యానికి పెద్దపీట

రాష్ట్ర విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి- అద్దంకి

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి మంగళవారం ప్రారంభించారు. తొలుత అద్దంకి పట్టణంలో రూ.1.50 కోట్లతో నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి గొట్టిపాటి, జిల్లా కలెక్టర్ వెంకట మురళి ప్రారంభించారు. అనంతరం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నియోజకవర్గంలో ఐదు ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. అద్దంకి పట్టణ పరిధిలో సుమారు రూ. 1.50 కోట్లు వెచ్చించి ఆసుపత్రిని నిర్మించినట్లు చెప్పారు. ఈ నెలాఖరుకి నియోజకవర్గం పరిధిలోని మరో 4 ఆరోగ్య కేంద్రాలను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గం ప్రజల కోరిక మేరకు మేదరమెట్లలో త్వరలోనే డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. అనంతరం అద్దంకి మండలం గోవాడ గ్రామ పరిధిలో నామ్ రోడ్డు నుంచి గోవాడ గ్రామానికి రూ. 1.20 కోట్ల వ్యయంతో కొత్త నిర్మించిన తారు రోడ్డును మంత్రి ప్రారంభించారు. తొలి దశలో రూ. 6 కోట్ల వ్యయంతో నియోజకవర్గంలో రోడ్లు వేశామని, మరో రూ. 7.5 కోట్లతో రెండో దశలో రహదారులు నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. అన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా, రోడ్ల నిర్మాణం, మరమ్మతులతో పాటు మొత్తం 175 నియోజకవర్గాల పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. అనంతరం కొటికలపూడి పంచాయతీ పరిధిలోని పార్వతీపురంలో జల జీవన్ మిషన్ కింద సురక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులుటిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

నివాళులర్పిస్తున్న నాయకులు

'దుగ్గిరాల'కు ఘన నివాళి

ప్రజాశక్తి-బాపట్ల

చీరాల-పేరాల ఉద్యమానికి నాయకత్వం వహించి నడిపించిన ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యను నేటి యువత ఆదర్శం తీసుకోవాలని ఇన్‌ఛార్జి డిప్యూటీ తహశీల్దారు పి. సీతా భవాని తెలిపారు. దుగ్గిరాల వర్ధంతిని పురస్కరించుకొని రెవెన్యూ కార్యాలయ ఆవరణలోని దుగ్గిరాల గోపాలకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీతాభవాని మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాలను అర్పించిన త్యాగమూర్తులతోపాటు వివిధ రంగాలలో విశేష కృషి చేసి, దేశ ఖ్యాతిని ఇనుమడింపచేసిన బాపట్ల ప్రాంతానికి చెందిన మహానుభావుల విగ్రహాలను ఏర్పాటు చేసి, వారిని గురించి భావితరాలు తెలుసుకొని స్ఫూర్తిని పొందే విధంగా వారి జయంతి, వర్ధంతులు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న 'ఫోరం ఫర్ బాపట్ల' కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు ఎ. మల్లికార్జున, చిత్రకారుడు జీవి, ఎం. నరసింహరావు, తహశీల్దారు కార్యాలయ సిబ్బంది మణికంఠ, ఉషాకాంత్, సాయిబాబు, కె.కోటేశ్వరరావు, జి.రాజారావు, డి.చెంచుబాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులు

విజేతలకు సన్మానం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

గుంటూరు జిల్లా పెదనందిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈనెల 8న ఆదివాసి సాంప్రదాయ పద్ధతిలో రాష్ట్రస్థాయి కర్రసాము పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఐలవరం గ్రామానికి చెందిన మాస్టర్ దీపాల నవీన్ పాల్ శిష్యులు పాల్గొని బంగారు పతకాలు సాధించారు. జూనియర్స్ విభాగంలో జి. జగదీష్, జి. సాయి మణికంఠ సబ్ జూనియర్ విభాగంలో ఎ. గిరి వెంకట మర్దసాయి ద్వితీయ స్థానం, టి. రాజు తతీయ స్థానంలో నిలిచారు. మహిళా సబ్ జూనియర్ విభాగంలో జి. గీతిక శ్రీ ద్వితీయ స్థానం, సీనియర్ విభాగంలో ఎ. దేవికా రాణి ప్రథమ స్థానంలో నిలిచారు. సింగిల్ స్టిక్ విభాగంలో పి . యుగంధర్, కె. సూర్యవిశ్వేస్వర్, డబల్ స్టిక్ విభాగంలో జి. లిఖిత్, ఎం. సంజయ్, ఎం. ప్రేమ్ స్వరూప్, జి. నితిన్ పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను, మాస్టర్ దీపాల నవీన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాని శివరామకృష్ణ కూటమి నాయకుడు రావి శివరామకృష్ణ (రిటైర్ ఫిజికల్ డైరెక్టర్), చీఫ్ కోచ్ అండ్ ఆర్గనైజర్‌చెవుల శ్రీరామ్, వర్ల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు

ప్రజాశక్తి - యద్దనపూడి

మండల పరిధిలోని గ్రామాలలో ఉన్న 3 నుంచి 18 సంవత్సరాల వయసు కలిగిన వికలాంగ విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు, మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు భవిత కేంద్రం ఐఇఆర్‌టిలు బి.చంద్రశేఖర్, కె.సురేఖ తెలిపారు. యద్దనపూడి గ్రామంలోని వికలాంగ విద్యార్థిలను భవిత కేంద్రంలో చేర్పించేందుకు ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఐదుగురు విద్యార్థులను గుర్తించినట్లు మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ చిలుకూరి గోపి తెలిపారు. ప్రతి మంగళవారం యద్దనపూడిలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపి నిర్వహించనున్నట్లు తెలిపారు.

రైతులు సమిష్టిగా సహకరించాలి

ప్రకాశం, బాపట్ల జిల్లాల నాబార్డ్ డీడీ జి.రవికుమార్

ప్రజాశక్తి- ఇంకొల్లు

రైతులందరూ సమిష్టిగా కలిసికట్టుగా సహకరిస్తే ఎఫ్‌పిసి సెంటర్ అభివృద్ధి చెందుతుందని ప్రకాశం, బాపట్ల జిల్లాల నాబార్డ్ డీడీ జి.రవికుమార్ తెలిపారు. మండల పరిధిలోని నాగండ్ల గ్రామంలో ఇంకొల్లు సంరక్షణ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ సెంటర్‌కు సంబంధించిన వాటాదారులతో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ నాబార్డ్ గురించి రైతులకు వివరించారు. నాబార్డ్ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం కేంద్రం ప్రభుత్వం ఎఫ్‌పిసి సెంటర్లను ప్రారంభించి నాబార్డ్ ద్వారా కృషి చేస్తుందన్నారు. ప్రకాశం జిల్లాలో 15 , బాపట్ల జిల్లాలో 8 ఎఫ్‌పిసి సెంటర్లను ప్రారంభించినట్లు తెలిపారు. నాబార్డ్ సంస్థ ఆధ్వర్యంలో కొన్ని స్వచ్ఛంద సంస్థలకు ఎఫ్‌పిసి సెంటర్ల నిర్వహించే బాధ్యత అప్పజెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల చర్చ్ కో కన్వీనర్ శివ, సాయి, ఇంకొల్లు సంరక్షణ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఎమ్‌డి ముప్పరాజు శ్రీనివాస్ బాబు, బిఒడిలు కరి శ్రీమన్నారాయణ, ఇంద్ల శ్రీనివాసరావు, బాచిన వీరయ్య, చెరుకూరి రమేష్, నాగండ్ల గ్రామానికి చెందిన రైతు వాటాదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాబార్డ్ డీడీ రవికుమార్

రాయితీపై డ్రోన్ అందజేత

ప్రజాశక్తి-అద్దంకి : ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణతో పంటల సాగు సులభమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రభుత్వం రైతులకు కావాల్సిన అన్ని రకాల వ్యవసాయ యంత్ర పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. భూసార పరీక్షలు నిర్వహించి భూమిలోని లోపాల గురించి రైతులకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కొటికలపూడి గ్రామంలోని పార్వతి కిసాన్ డ్రోన్ కస్టమ్ హైరింగ్ సెంటర్‌కు 80 శాతం రాయితీ పై డ్రోన్‌ను మంగళవారం అందజేశారు. ఈ డ్రోన్ పూర్తి ఖరీదు రూ. 9.80 లక్షలు. మండలానికి మూడు డ్రోన్లు మంజూరైనట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.అనంతరం పిఎండిఎస్ విత్తన కిట్లు రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ, గ్రామ సర్పంచి ,నీటి సంఘం అధ్యక్షుడు కోట శివయ్య, నాగినేని రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి- సంతమాగులూరు : మండల పరిధిలోని కామేపల్లి గ్రామంలో రెండు వారాలుగా ఉపాధి హామీ పనులు నిలిపి వేశారు. దీంతో పనులు లేక కూలీలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన 400 మందిఉపాధి హామీ పనుల ద్వారా లబ్ధి పొందుతున్నారు. పనులను గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ గాడిపర్తి రాంబాబు చేయిస్తున్నారు. టిడిపికి చెందిన సర్పంచి వర్గంలో రాంబాబు ఉన్నాడు. వైసిపి నుంచి టిడిపిలో చేరిన వారు మరో వర్గంలో ఉన్నారు. అయితే ఉపాధి పనులను తమ వర్గానికి కేటాయించాలని, తమ వర్గంలో ఉన్న వారినే ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించు కుంటామని పట్టుబట్టి రాజకీయ పలుకుబడి కలిగిన నాయకులతో ఉపాధి పనులు నిలుపుదల చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ లాగిన్ కూడా ఆపేశారు. లాగిన్ లేనందున కూలీల హాజరు ఆగిపోవడంతో కూలీలకు పనులు కల్పించలేక పోతున్నానని ఫీల్డ్ అసిస్టెంట్ రాంబాబు చెబుతున్నారు. గ్రామంలోని వర్గాలతో పని లేకుండా తమ పనులు కల్పించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ శంకర్ రావుకు ఉపాధి కూలీలు మంగళవారం వినతి పత్రం అందజేశారు.

సాదా సీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి - రేపల్లె : ఎంపిపి పెనుమాల సుశీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్, ఉపాధి హామీ, హౌసింగ్, హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మొదలైన అంశాలపై అధికారులు సర్పంచుల ఎదుట చదివి వినిపించారు. ఇలా నామమాత్రంగా సమావేశాలు నిర్వహించడం ఎందుకని ప్రజా ప్రతినిధులు మండిపడుతున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటేశ్వరరావు ఎంపీడీవో ప్రసాద్ బాబు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రమేష్ , సర్పంచులు కార్యదర్శులు పాల్గొన్నారు.

కామ్రేడ్ లాజర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి- భట్టిప్రోలు

భట్టిప్రోలు మండలం పెద్ద పులివర్రు గ్రామపంచాయతీ పరిధిలోని అక్కివారిపాలెం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ గొర్రుముచ్చు లాజరు తతీయ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్ మాట్లాడుతూ లాజరు తన తుది శ్వాస వరకు సిపిఎం అభివృద్ధికి తోడ్పాటును అందించినట్లు తెలిపారు. పార్టీ ఇచ్చే ప్రతి పిలుపును అమలు చేస్తూ కూలి పోరాటాలు, కౌలు రైతు సమస్యలపై జరిగే పోరాటాలలో ఆయన నిరంతరం పనిచేసేవారన్నారు. పూర్తి పార్టీ సభ్యుడిగా కొనసాగుతూ తన కుటుంబ సభ్యులను కూడా పార్టీ వైపు మళ్ళించి ప్రజా సమస్యల పోరాటాలకు నాంది పలికినట్లు కొనియాడారు. కుమారుడు సుధాకర్ సిపిఎం మండల కార్యదర్శిగా ప్రస్తుతం పని చేస్తున్నారని చెప్పారు. లాజరు లేని లోటు పార్టీకి తీరనిదని, భవిష్యత్తులో కార్మిక, కర్షక పోరాటాలను లాజరు స్ఫూర్తితో ప్రతి ఒక్కరు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. లాజర్ ఆశయ సాధనకు కట్టుబడి పని చేస్తామని చెప్పారు. అనంతరం లాజరు స్థూపం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వేములపల్లి వెంకటరామయ్య, గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు, సిఐటియు జిల్లా నాయకులు ముత్యాలరావు, మండల కమిటీ సభ్యులు మురుగుడు సత్యనారాయణ, రామస్వామి, నాగరాజు, పి నాగమల్లేశ్వరరావు, బొనిగల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లాజరు స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

20న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతన పెంపుదల కోసం ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నాడు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ఒంగోలు నగర గౌరవ అధ్యక్షులు టి.మహేష్ మాట్లాడుతూ రిటైర్ అయ్యి.. చనిపోయిన అనారోగ్యం పాలైన వారి స్థానాలలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని, గ్రాట్యుటీ చెల్లించాలని, ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసినచో కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని, కిట్లు, భద్రత సౌకర్యాలు సకాలంలో అందించాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, లేని పక్షంలో జూన్ 20 నుండి ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె బాట పట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నగర కార్యదర్శి టి.విజయమ్మ, యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు నాయకులు ఆర్.రాములు, ఆర్.శ్రీనివాసరావు, సంతోషం, కె.మోహన్‌రావు, వెంకటస్వామి, శివమ్మ, శ్రీదేవి, వెంకాయమ్మ పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసం కోసం బాలోత్సవం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

బాలోత్సవ కార్యక్రమాలు మానసిక ఉల్లాసానికి, సజనాత్మకతను పెంపొందించ డానికి దోహదపడతాయని బాలోత్సవ కమిటీ నాయకులు వి.బాలకోటయ్య అన్నారు. మంగళవారం ఒంగోలు చైతన్య కాలనీలో బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన చిల్డ్రన్స్ క్లబ్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలను ఆలోచింపజేసే విధంగా చిల్డ్రన్స్ క్లబ్ ఆటలు, పాటలు, బొమ్మలు, డాన్సులు, మ్యాజిక్కు రకరకాల రూపాలలో అనేక విషయాల పట్ల అవగాహన కలిగే విధంగా కార్యక్రమాలు రూపొందించి నేర్పించడం అభినందించదగ్గ విషయమన్నారు. వీటిని విస్తతంగా నిర్వహించడం వల్ల అనేక విషయాలను పిల్లల ద్వారా తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎక్కువ కేంద్రాల్లో నడిపేందుకు కషి చేయాలని సూచించారు. ఐద్వా నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ సమాజాన్ని మార్చే ప్రయత్నంలో భాగంగా బాల్య దశ లోనే అనేక అంశాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే పిల్లలను సక్రమైన మార్గంలో నడిపిస్తూ వారికి నాణ్యమైన విద్య,ఉపాధి అవకాశాల పై అవగాహన కల్పించేందుకు ఎస్ఎఫ్ఐ పనిచేస్తుందని అన్నారు అనంతరం శిక్షణకు హాజరైన పిల్లలందరికీ నోట్ బుక్స్ పంపిణీ చేశారు.

హామీలు అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆటో, రవాణా రంగ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో డిటిసి ఆర్.సుశీలను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.మోహన్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిపోయినా ఇంతవరకు రవాణా రంగ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు చెరదల మోజేష్, పాలకీర్తి కొండలు, సుధాకర్, శ్యాంసన్, పిడిఎస్‌యు నేత ఎల్.రాజశేఖర్ పాల్గొన్నారు.

డిటిసికి అర్జీ ఇస్తున్న నాయకులు

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 పరిధిలోని సోనియాగాంధీ నగర్, సుజాతనగర్, చెన్నకేశవ మన్యం, ఎన్‌టిఆర్ పార్క్, రెవెన్యూ కాలనీ తదితర ప్రాంతాలలో బుధవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల (ట్రీ కటింగ్) కారణం వల్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఈఈ శ్రీ కెవి.పాండురంగారావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి.. సహకరించాలని కోరారు.

డి1 పరిధిలో..

11 కెవి రాజీవ్ నగర్ ఫీడర్‌లో బుధవారం ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు లైను మరమ్మతుల కారణంగా, విద్యుత్ లైనుకు అడ్డంగా ఉన్న చెట్టుకొమ్మలు తొలగించటం కోసం రాజీవ్ నగర్, రాజీవ్ నగర్ ఎక్స్ టెన్షన్, వివిప రోడ్డు, పోస్టాఫీస్, నిర్మల స్కూల్, వివిప రోడ్డు 3,4,5, లైన్స్, అల్లూరయ్య స్వీట్స్, ఓల్డ్ సుజాతనగర్, వర్మ హోటల్, హర్షిని డిగ్రీ కాలేజ్, అడపా బేర్స్, గద్దలగుంట స్మశానం, ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు.

వృద్ధురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఏ ఆధారం లేని వృద్ధురాలు భవానీకి సూర్య శ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవనోపాధి, వైద్య ఖర్చులు, నిత్యావసర వస్తువులతో పాటు ఆర్థిక సాయాన్ని ట్రస్టు వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకులు షేక్ షహనాజ్-సర్దార్‌భాషా ఆధ్వర్యంలో సినీ హీరో, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకష్ణ జన్మదినోత్సవం సందర్భంగా ట్రస్ట్ ఆవరణలో దివ్యాంగుల సమక్షంలో మురళీకష్ణ కేక్ కట్ చేశారు. ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్‌భాషా మాట్లాడుతూ సీనియర్ ఎన్టీఆర్ అభిమాని పేరు చెప్పని ప్రవాస భారతీయుడు ఆర్థిక సహకారంతో ఈ ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, ట్రస్టు గౌరవ సభ్యులు మండవ సుబ్బారావు, ట్రస్టులోని దివ్యాంగులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న మురళీకృష్ణ

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

- 23 మందికి జరిమానా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మద్యం మత్తులో వాహనం నడిపితే చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ వాహనదారులను హెచ్చరించారు. ఒంగోలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 23 మందిని మంగళవారం ఒంగోలు కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.2,30,000 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ఎస్‌పి మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపి రోడ్డు ప్రమా దాలకు గురైతే తీవ్రంగా గాయపడటం, ప్రాణాలు కోల్పోవడం వంటివి జరిగి కుటుం బాలు ఇబ్బందులు ఎదుర్కొంటాయన్నారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్‌తో కలిగే ప్రమాదాల గురించి వాహనదారులకు వివరిస్తూ రోడ్డు భద్రతా ప్రమాణాలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

స్పీకర్‌ను సత్కరిస్తున్న ఎంపీ మాగుంట

లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఢిల్లీలోని స్పీకర్ కార్యా లయంలో లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన ఎంపి మాగుంట ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు విషయాలు చర్చించుకున్నారు.

దిగజారుతున్న పొగాకు ధరలు

కనిష్టంగా కిలో రూ.180

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పొగాకు మార్కెట్ జూదంలా మారుతోంది. ఎంతో కొంత ధర పెరుగుతుందనుకుంటున్న రైతుల ఆశలు నిరాశ అవుతున్నాయి. గత వారం వరకు కనిష్ట ధర కిలోకు రూ.200 పలకగా ఈ వారం ప్రారంభంలో రూ.190 నుంచి రూ.180కి దిగజారింది. వివిధ కారణాలతో తిరస్కరిస్తున్న పొగాకు బేళ్ళ సంఖ్య 30 శాతం దాటుతోంది. ధరల్లో కూడా రూ.2, రూ.3 పెరగడం లేదా తగ్గడం మినహా పెద్దగా మార్పు లేదు. మంగళవారం నాడు వేలంకు తెచ్చిన వాటిలో అధిక మొత్తంగా 30.51 శాతం (2425 బేళ్ళు) తిరస్కరించారు. రీజియన్ పరిధి లో 7947 బేళ్ళ ఆక్షన్‌కి రాగా 5522 బేళ్ళ అమ్ముడుపోయాయి. వివిధ కారణాలు చూపి 2425 బేళ్లను (30.51 శాతం) తిరస్కరిం చారు. వేలం ప్రారంభించినప్పటి నుంచి ఇంత మొత్తంలో తిరస్కరించడం ఇది మూడోసారి. బ్లాక్ సాయిల్ పరిధిలోని ఒంగోలు 1, 2, వెల్లం పల్లి, టంగుటూరు, కొండపి వేలం కేంద్రాల్లో 4022 బేళ్ళ ఆక్షన్‌కు తేగా 2918 బేళ్ళ కొను గోలు చేశారు. ఇక్కడ 1,104 (27.44 శాతం) బేళ్ళ తిరస్కరించారు. కిలో కనిష్ట ధర రూ.180, గరిష్ట ధర రూ.280 పలికింది, సగ టున కిలో రూ.240.68 పలికింది. కాగా లైట్ సాయిల్ పరిధిలో పొదిలి, కనిగిరి, కందుకూరు 1, 2, కలిగిరి, డిసి పల్లి కేంద్రాల్లో 3925 బేళ్ళ ఆక్షన్ కు తేగా 2604 బేళ్ళ కొనుగోలు జరగ్గా 1321 (33.65 శాతం) బేళ్ళ తిరస్కరించారు. ఇక్కడ కిలో గరిష్ట ధర రూ.280 కాగా కనిష్ఠ ధర రూ.180కి దిగజారింది. సగటున కిలో రూ.235.21 పలికింది.

గ్రానైట్ టిప్పర్లు పట్టివేత

క్రిమినల్ కేసు నమోదు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఎస్పీ డిఆర్ దామోదర్ ఐపిఎస్ ఉత్తర్వుల మేరకు సంతనూతలపాడు వద్ద ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు, సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు మంగళవారం నాడు వాహనాల తనిఖీ నిర్వహించారు. చీమకుర్తి నుంచి రామాయపట్నం పోర్టుకు పోతున్న పెద్దపెద్ద రాళ్లతో కూడిన టిప్పర్లని పట్టుకున్నారు. వారి నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల తోటి వాహనదారులకి హాని కలగడానికి ఆస్కారం ఉందని, వారిపై సంతనూతల పాడు పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేస్ నమోదు చేశారు. ఎటువంటి భద్రతా చర్యలు తీసుకోకుండా పెద్దపెద్ద రాళ్లను తీసు కెళుతున్న ట్రాలీని ఆపి.. దానిని ఆర్‌టీవో ఆఫీస్‌కి చర్యల నిమిత్తం పంపారు. ఈ సందర్భంగా సిఐ శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ ఇకనుంచి భద్రత చర్యలు తీసుకోకుండా చీమకుర్తి నుంచి వచ్చే పెద్ద పెద్ద రాళ్లతో కూడిన టిప్పర్ల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గ్రానైట్ టిప్పర్లను పట్టుకున్న సిఐ శ్రీకాంత్, ఎస్ఐ అజయ్

9న సమ్మెను జయప్రదం చేయండి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి

ప్రజాశక్తి-బాపట్ల

జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం బాపట్లలో పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సిఐటియు బాపట్ల జిల్లా విస్తత సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక చట్టాలను మార్పు చేస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె జరుగుతుందన్నారు. ఈ సమ్మెలో దేశంలో స్వతంత్ర ఫెడరేషన్ అయిన ఇన్సూరెన్స్, పోస్టల్, బిఎస్ఎన్ఎల్, డిఫెన్స్, రైల్వే రంగాల్లో సమ్మె జరగనున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన సమ్మెల్లో 20 కోట్ల మంది కార్మికులు భాగస్వామ్యం అయితే జూలై 9న జరగబోతున్న సమ్మెలో 35 కోట్ల మంది పాల్గొంటారని అంచనా వేస్తున్నారని పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఈ సమ్మె ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బిజెపి విధానాల్ని ముందుకు తీసుకెళ్తూ కార్మికుల పనిగంటలను ఎనిమిది గంటల నుంచి పది గంటలకు మారుస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం చేయటం కార్మిక వ్యతిరేక విధానాల్లో భాగమన్నారు. అనేకమంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయటంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు కూటమి ప్రభుత్వం వత్తాసు పలుకుతుందన్నారు. నేడు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 5 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను ఒక కలం పోటుతో కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యం తొలగిస్తూ ఉంటే కూటమి ప్రభుత్వం మౌనం వహించిందన్నారు. గతంలో కార్మికులు ఆందోళన చేసిన సందర్భంలో తెలుగుదేశం కూటమి నాయకులు హాజరై కార్మికులకు సంఘీభావాన్ని తెలియజేసి.. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా కాపాడుకుందామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన అవసరం రాష్ట్రంలోని ప్రజలు, మేధావులపై ఉందని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ జిల్లాలో చీరాలలోని ఐఎల్‌టిడి ఫ్యాక్టరీల్లో లైన్-2 ప్రారంభించారని ఈ లైన్-2లో 400 మంది క్యాజువల్ కార్మికులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వారిని కార్మికులుగా గుర్తిస్తామని యాజమాన్యం ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు జరగట్లేదని అన్నారు. కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్లను నెరవేర్చకపోతే రాబోయే కాలంలో సిఐటియు ఆధ్వర్యంలో ఐఎల్‌టిడి కార్మికులకు మద్దతుగా ఆందోళన కార్యక్రమాలు చేయవలసి ఉంటుందని హెచ్చరించారు. సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.మణిలాల్ అధ్యక్షత వహించారు. సమావేశంలో సిఐటియు నాయకులు ఎం.వసంతరావు, టి.వెంకటేశ్వర్లు, ఎం.వీరాంజనేయులు, కె.యూనీస్, ఎం.వెంకటేశ్వరమ్మ, కె.శరత్, నారాయణరెడ్డి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అద్దంకి

ఇంటర్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ వారి ఆధ్వర్యంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చెన్నుపాటి రామాంజనేయులు మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక విశ్వభారతి జూనియర్ కాలేజీలో జూనియర్ ఇంటర్ చదువుతున్న తన్నీరు మణికంఠ, సీనియర్ ఇంటర్ చదువుతున్న సయ్యద్ అమీర్ అహమ్మద్‌కు రూ.30 వేల (ఒక్కొక్కరికి రూ.15 వేలు వంతున) ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చెన్నుపాటి రామాంజ నేయులు మాట్లాడుతూ తను కూడా పేద కుటుంబం నుంచి వచ్చానని, చదువుకునే రోజుల్లో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడినట్లు తెలిపారు. విద్యలో రాణించి ఉన్నత స్థితికి చేరుకున్నట్లు తెలిపారు. విద్య వల్లే పేదరికం నుంచి విముక్తి లౌతామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అద్దంకి లేవి ప్రసాద్, అన్నంగి సుబ్బారావు, పువ్వాడరామకోటేశ్వరావు, బాచిన పూర్ణచంద్రరావు, కాలేజీ ప్రిన్సిపల్ ఆదినారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పత్రాలు అందజేస్తున్న వెంకట్రావు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి -భట్టిప్రోలు : 10వ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినవి ద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభా అవార్డులు అందజేసింది. భట్టిప్రోలులోని విశ్వశాంతి స్కూల్‌కు చెందిన మహమ్మద్ సైయిష్ఠ, యార్లగడ్డ సాయి ప్రియ, గోగినేని బ్లెస్సిమేఘన ప్రతిభా అవార్డులు దక్కాయి. అవార్డు అందుకున్న విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ వెంకట్రావు, పాలన అధ్యక్షులు ఫణి కుమార్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

సరిహద్దు ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి-పంగులూరు : మండల పరిధిలోని చందలూరు, ఇంకొల్లు మండలంలోని కొన్ని గ్రామాల సరిహద్దు పొలిమేరను చీరాల ఆర్‌డిఓ చంద్రశేఖర్ నాయుడు మంగళవారం పరిశీలించారు. పొలిమేర సరిహద్దు విషయంలో చందలూరు, కొనికి గ్రామాల కు చెందిన రైతులు మధ్య వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. కొనికి గ్రామానికి చెందిన రైతులు సరిహద్దులో చందలూరు వైపు నుంచి వర్షపు నీరు రానివ్వకుండా మట్టిని తోలారు. వర్షపు నీరు క్రిందికి పోకుండా పొలాల్లోనే ఉండేలా మట్టితోలాటంతో చందలూరు రైతులు అధికారులను ఆశ్రయించారు. ఈ విషయమై గతంలో తహశీల్దారు ఇతర అధికారులు పరిశీలించారు. కొనికి గ్రామ రైతులకు నోటీసులు కూడా పంపారు. సమస్య పరిష్కారానికి ఇరిగేషన్ అధికారులు మార్గం చూపాలని, తూములు ఏర్పాటు చేసి నీరు ఇరువర్గాలకు ఇబ్బంది లేకుండా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పి .సింగారావు, సర్వేయర్ సురేష్, విఆర్‌ఒలు, ఇరు గ్రామాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాలువలకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి- చెరుకుపల్లి : రానున్న వర్షాకాలం దష్ట్యా పంట కాలువలు, మురుగు కాలువల ద్వారా నీటిపారుదలలో లోపం లేకుండా చూడాలని ఎంపిపి మత్తి దివాకర రత్న ప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ షేక్ మహబూబ్ సుభాని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కరిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పద్మావతి, గోవాడ సాగునీటి సంఘం అధ్యక్షుడు ఎంఆర్‌కె.మూర్తి, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ముగిసిన కిశోర బాలికా వికాసం

ప్రజాశక్తి- పంగులూరు

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, అది బాలికల జీవితాలకు శాపం వంటిదని ఐసిడిఎస్ కోరిసపాడు ప్రాజెక్టు సిడిపిఒ కష్ణకుమారి తెలిపారు. కిశోర వికాసం ముగింపు కార్యక్రమంలో మండల పరిధిలోని తూర్పు తక్కెలపాడు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లా డుతూ బాల్యవివాహాలను ప్రోత్సహించ కూడదన్నారు. బాల్య వివాహాలు చేసుకుంటే చిన్నప్పుడే పిల్లలు పుట్టడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. కిశోర బాలికల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటుందన్నారు. రక్తహీనత నుంచి బయటపడేందుకు పుష్టికరమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ముప్పవరం సెక్టార్ సూపర్‌వైజర్ పద్మజ మాట్లాడుతూ కిశోర బాలికలు పలు జాగ్రత్త తీసుకోవాలని తెలిపారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు కిరణ్, రాజ్యలక్ష్మి, ఏఎన్‌ఎం జానకి, ఆశా వర్కర్లు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు : బాల్యవివాహాలు చేయరాదని సిడిపిఒ జి. సుభద్ర తెలిపారు. పర్చూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ-1 కేంద్రంలో కిశోర వికాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తుంటే తమ దష్టికి తీసుకురావాలన్నారు. కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ దీపా దేవి, అంగన్‌వాడీలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

పంగులూరులో మానవ హారం నిర్వహిస్తున్న బాలికలు

రేపల్లె : విద్య, ఆరోగ్యం, పోషకాహారం, మానవ అక్రమ రవాణా, ఆత్మరక్షణ జీవనోపాధి అవకాశాలు, బాల్యవివాహాల నిర్మూలన తదితర అంశాలపై కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సిడిపిఒ సుచిత్ర పేర్కొన్నారు. మహిళాభివద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోర వికాసం సమ్మర్ క్యాంపైన్ ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ కిశోర వికాసం ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగుపరచడానికి మంచి అవకాశమన్నారు. 11-18 ఏళ్ల బాలికలకు విద్య ఆరోగ్య భద్రత ఆర్థిక స్వావలంబన మెరుగుపరచడంకార్యక్రమ లక్ష్యమన్నారు. బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులు, బాల్య వివాహాల నివారణ దిశగా ప్రతి ఒక్కరూ కషి చేయాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని తెలిపారు.అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శివ జ్యోతి, మహిళా సంరక్షణ కార్యదర్శి హిమబిందు, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, కిశోర బాలికల తల్లులు పాల్గొన్నారు.

అద్దంకి : కిశోర బాలికల సాధికారతకు, బాల్యవివాహాలను అరికట్టేందుకు, బాలికల విద్యకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరినీ అభినందించాల్సిన అవసరముందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె. పద్మావతి పేర్కొన్నారు. అద్దంకి-3 సచివాలయ పరిధిలోని గాజులపాలెం, రాంనగర్, రాజీవ్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర వికాస కార్యక్రమంలో భాగంగా పిల్లల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ వార్డు సచివాలయాల్లో కిశోర బాలికలతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. వేసవి సెలవులులో ప్రతి మంగళ, శుక్రవారాల్లో కిశోర బాలికా వికాసం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాలికల ఆరోగ్యం, విద్య, వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై, రక్తహీనతపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ అంశాలను తల్లిదండ్రుల సమక్షంలో మళ్లీ గుర్తు చేసినట్లు తెలిపారు. అనంతరం బాలబాలికలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగనవాడీ కేంద్రాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. మహిళా సంరక్షణ కార్యకర్త ఎం.కల్పన, అంగన్‌వాడీలు వి. జయలక్ష్మి. పి.ఝాన్సీ, వి.శివపార్వతి, వెంకట సుబ్బులు , కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం : బాల్యవివాహాలను ప్రోత్సహించిన వారికి లక్ష రూపాయల జరిమానా, రెండు సంవత్సరాల జైలుశిక్ష తప్పదని జిల్లా బాలల సంరక్షణ డిసిపియు డి. రాము తెలిపారు. వేటపాలెం సెక్టర్‌లో కిశోర వికాసం ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఫోక్సో చట్టం, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సజ్జ పుష్పవల్లి, అంగన్‌వాడీలు బుల్లెమ్మాయి, అన్నపూర్ణ, సుప్రభా, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిలో మాట్లాడుతున్న సూపర్ వైజర్ పద్మావతి

రేపల్లెలో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు

వేటపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

పొగాకు రైతులను ఆదుకుంటాం

జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - చీరాల

నల్లబర్లీ పొగాకును ఎపి మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. చీరాల మండలం పేరాలలోని ఏపీ మార్క్ ఫెడ్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములో నూతనంగా ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వెంకట మురళి, ఎమ్మెల్యే ఎంఎం. మాల కొండయ్య ప్రారంభించారు. పొగాకు రైతులను ఆదుకోవడానికే ఏపీ మార్క్ ఫెడ్‌ను ప్రభుత్వం రంగంలోకి దించినట్లు కలెక్టర్ చెప్పారు. కంపెనీల మాటలు నమ్మి గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలలోని రైతులు నల్లబర్లీ పొగాకును సాగు చేసి మోస పోయారన్నారు. రైతుల క్షేమాన్ని ప్రభుత్వం దష్టిలో ఉంచుకుని నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం చీరాల, పర్చూరు మండలాలలో రెండు కేంద్రాలను ప్రారంభించామన్నారు. మరో మూడు కేంద్రాలు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటు న్నామన్నారు. రైతుల వద్ద 7.48 లక్షల క్వింటాళ్ల పొగాకు ఉన్నట్లు గుర్తించామన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా 1.48 లక్షల క్వింటాళ్ల పొగాకును కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 16 నుంచి విస్తతంగా పొగాకు కొనుగోలు చేపడు తామన్నారు. మార్క్ ఫెడ్ తోపాటు ఇతర కంపెనీలు కొనుగోలు చేసేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన పొగాకును ప్రాసెసింగ్ చేసి ఏడాది వరకు నిల్వ ఉంచేలా ఏర్పాట్లు చేశామన్నారు. వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములను ఇందుకోసం వినియో గిస్తున్నామన్నారు. బాపట్ల జిల్లా పరిధిలోని భూముల పరిస్థితులు, భూసారం ఆధారంగా ఎలాంటి పంటలు వేయాలో పరీక్షించి చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను గుర్తించి మొక్కజొన్న, శనగ, వేరుశెనగ వంటి పంటలను సాగు చేసేలా వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ ఏడాది జూలై నెలలోనే కష్ణా పశ్చిమ డెల్టా, ఎన్‌ఎస్పి నీరు విడుదల కానుందన్నారు. ఆ దిశగా పంటలు సాగు చేసుకునేలా రైతులను చైతన్య పరుస్తామన్నారు. చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ పొగాకుకు గత ఏడాది క్వింటా ధర రూ.17 వేలు పలికిందని, ప్రస్తుతం రూ.7000 దిగజారటంతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. కంపెనీల మాట విని పొగాకు పంటను అధికంగా ఉత్పత్తి చేయడంతోనే ఈ సమస్య ఎదురైందని తెలిపారు. రైతుల ఇబ్బందులను తొలగించడానికే మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. లక్ష్యం మేరకు పొగాకును కొనుగోలు చేయడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.ఈ

పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకట మురళి, ఎమ్మెల్యే మాలకొండయ్య

ఇనాం భూముల సమస్యలు పరిష్కరించండి

సిసిఎల్ఎ కమిషనర్‌కు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వినతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఇనాం భూముల సమస్య పరిష్కారానికి చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ జి.జయలక్ష్మితో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలో గత 70, 80 సంవత్సరాలుగా రైతులు సాగు చేసుకుంటున్న ఇనాం భూములకు రైతువారీ పట్టాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా మార్టూరు మండలంలోని లక్కవరం, జంగమహేశ్వపురం, పర్చూరు మండలంలోని ఏదుబాడు, చెన్నుంబొట్ల అగ్రహారం గ్రామాలలో ఈ భూములు ఉన్నాయన్నారు. రైతులు గత 80 సంవత్సరాలుగా ఇనాం,ఎస్టేట్ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. సన్న, చిన్నకారు రైతులు సాగు చేసుకుంటున్న ఈ భూములు ఇనాం భూములు కావటం వల్ల వారికి పట్టాదారు పాసు పుస్తకాలు , ఇతర యాజమాన్య హక్కు పత్రాలు లేవని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తాను తీసుకెళ్లినట్లు వివరించారు. సమస్యను పరిష్కరించేలా ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి కీలక ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం పరంగా అందించే సంక్షేమ పథకాలు, సబ్సిడీ పథకాలు అందక వీరు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.తక్షణమే సమస్యను పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు.

సిసిఎల్ఎ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

బ్యాంకర్ల తీరు పట్ల రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి - అద్దంకి

ప్రభుత్వ బ్యాంకులు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల్లా వ్యవహరిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతుంటే రుణాలు తీర్చాలని బ్యాంకర్ల ఒత్తిడి చేస్తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతు కథనం ప్రకారం... అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డులోనున్న ఓ బ్యాంకు మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన రామాంజనేయులు అనే రైతు18 నెలల క్రితం తన పొలం తాకట్టు పెట్టి క్రాఫ్ లోన్‌గా రూ. ఒక లక్ష రూపాయల రుణం తీసుకున్నారు. పంటలు దెబ్బతినడంతో నష్టపోయిన రైతు తీసుకున్న రుణం చెల్లించలేక పోయాడు. దీంతో బ్యాంకు అధికారులు నోటీసు పంపించారు. దీంతో ఆ రైతులు రుణం చెల్లించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడు. రుణం ఇచ్చే సమయంలో ఓ వ్యక్తి గ్యారెంటర్ సంతకం చేశాడు. ఈ క్రమంలో గ్యారెంటర్‌గా సంతకం పెట్టిన వ్యక్తి నగదు తీసుకొనేందుకు బ్యాంకు వచ్చాడు. దీంతో బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ రుణ గ్రహీతకు గ్యారెంటీర్‌గా సంతకం పెట్టావని, రుణం చెల్లించిన తర్వాతే బ్యాంకు నుంచి బయటకు వెళ్లాలంటూ ఆ వ్యక్తిని నిర్బంధించారు. ఈ విషయం గురించి రుణగ్రహీతకు సమాచారం అందటంతో ఆయన బ్యాంకు వద్ద చేరుకొని తాను తీసుకున్న రుణాన్ని చెల్లించాడు. అనంతరం గ్యారెంటర్‌ను బయటకు పంపారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ తీసుకున్న రుణం చెల్లింపులో ఆలస్యం జరిగే గ్యారెంటర్‌ను నిర్బంధించటం ఏమిటని బ్యాంకు అధికారులను ప్రశ్నించారు. భూమి చట్టపరంగా మీ చేతుల్లో ఉంది కదా అవసరమైతే వేలం నిర్వహించి బాకీ రాబట్టుకోవచ్చు కదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ బ్యాంకు లేక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ అని ప్రశ్నించాడు.

చిరస్మరణీయులు దుగ్గిరాల : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చీరాల

స్వాతంత్ర్య సమరయోధులు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య చిరస్మరణీ యులని, ఆయన ఆశయాలు ఆదర్శనీయమని ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య తెలిపారు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి అని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులుగా, కవిగా, గాయకుడిగా,సంఘ సంస్కర్తగా ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు.అదే విధంగా చీరాల పేరాల సత్యాగ్రహానికి నాయకత్వం వహించి,తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని సమున్నతంగా నిలిపిన ధీరోదాత్తుడు దుగ్గిరాలని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగడమే మనం ఆయనకు అందించే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిడి, జనసేన,బిజెపి నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రాస్తారోకో

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల మండలం చెరువు జమ్ములపాలెం ఎస్‌సి కాలనీకి చెందిన దాసరి సుభాషిణి (25) అనే మహిళపై ఆమె భర్త దాసరి హరీష్ పెట్రోలు పోసి నిప్పు అంటించారు. కాలిన గాయాలతో ఆమె సోమవారం మతి చెందారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జమ్ములపాలెం ఎస్‌సి కాలనీవాసులు గ్రామ సమీపంలోని బాపట్ల – పెదనందిపాడు రహదారిపై మంగళవారం రాస్తారోకో చేశారు. నిందితుడు హరీష్ ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మతురాలి ఇద్దరు కుమారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. హోం మంత్రి ,జిల్లా కలెక్టరు వచ్చి సుభాషిణి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇస్తే తప్ప రాస్తారోకో విరమించేది లేదని పట్టుబట్టి కూర్చున్నారు. ఈ విషయం గురించి తెలుసుకున్న బాపట్ల రూరల్ సిఐ కె.శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. నిందితుడిని అరెస్టు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. బాపట్ల డిఎస్‌పి, తహశీల్దారు సలీమా ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన కారులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు రాస్తారోకో విరమింప జేశారు.

రాస్తారోకో నిర్వహిస్తున్న కాలనీ వాసులు

పైపులైన్ పనులు పరిశీలన

ప్రజాశక్తి - చీరాల

ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా ఇంటింటికి నీటి కుళాయిని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యేకొండయ్య అన్నారు. చీరాల మండలం కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని దండుబాట వద్ద జనజీవన్ మిషన్ కింద ఏర్పాటు చేస్తున్న మంచినీటి కుళాయిల పైపు నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. వేసవి కాలంలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా ప్రతి ఇంటికి కుళాయిని ఏర్పాటు చేసి నీటి సరఫరా చేసేందుకు పైపు నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమన్నారు. ప్రతి ఇంటికి నీటిని అందించాలని లక్ష్యంతో జలజీవన్ మిషన్ ద్వారా గ్రామ ప్రజలకు లబ్ది చేకూర్చేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-బాపట్ల

మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి విమర్శించారు. వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో రాజధానిలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైసిపి కార్యాలయం వద్ద నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, వైసిపి జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, వైసిపి మహిళా విభాగం నాయకులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

ఫర్జానాకు బంగారు పతకం

ప్రజాశక్తి వేటపాలెం

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థిని జెయన్‌టియుకె కాకినాడ 2020–24 విద్యాసంవత్సరం బిటెక్ పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. జవహర్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాకినాడ ఇటీవల ప్రకటించిన 2020–24 బిటెక్ పరీక్షల్లో సి ఎస్ఇ, ఐటి విభాగానికి చెందిన ఎస్.కె.ఫర్జానా మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. జగదీష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఫర్జానాను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి యస్. ఇంద్రదీప్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

రూ.6 లక్షల ఎల్ఓసి అందజేత

ప్రజాశక్తి - పంగులూరు

బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న వ్యక్తి వైద్యచికిత్స కోసం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అండగా నిలిచారు. ఆ కుటుంబానికి వైద్యఖర్చుల నిమిత్తం రూ.6 లక్షల ఎల్ఓసిని మంజూరు చేయించారు. మండల పరిధిలోని ముప్పవరం గ్రామానికి చెందిన నిదానపు అచ్యుత రావు కుమారుడు కోటినాగులకి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి బ్రెయిన్ స్ట్రోక్ వైద్యం నిమిత్తం ఆ కుటుంబానికి రూ.6 లక్షలు మంజూరు చేయించారు. మంత్రి గొట్టిపాటి ఆదేశాల మేరకు గ్రామ టిడిపి నాయకులు అల్లంనేని బ్రహ్మానంద స్వామి, గరిమిడి జగన్మోహన్ రావు బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం ఎల్ఓసి అందజేశారు.

రోడ్లపై వరదలా.. మురుగు నీరు..

ప్రజాశక్తి - చీరాల : పేరు గొప్ప..ఊరు దిబ్బ.. అన్న చందంగా తయారై య్యింది చీరాల మున్సిపాలిటీ పరిస్థితి. స్వచ్ఛభారత్, పారిశుధ్య మెరుగుదలలో చీరాల మున్సిపాలిటీ ముందంజలో ఉందని ప్రగల్భాలు పలికే అధికారులు ఆచరణలో మాత్రం విఫలమవుతున్నారు. పట్టణంలోని 33 వార్డులలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. రోడ్లపై చెత్తాచెదారంతో నిండి ఉంది. చెత్త నుంచి దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు నీటి పారుదల సరిగ్గ లేదు. పట్టించుకోవాల్సిన అధికారులు కూడా నామ మాత్రపు పనులు చేపట్టి మమ అనిపిస్తున్నారు. అందుకు నిదర్శనమే పట్టణంలోని ప్రధాన కూడలి అయిన మసీదు సెంటర్లోని డ్రైనేజీ పారుదల పరిస్థితి. ఇటీవల డ్రైనేజీ పారుదల లేక పైపులు మరమ్మతులు గురయ్యాయి. అధికారులు తక్షణ చర్యలు చేపట్టి తాత్కాలిక మరమ్మతులతో చేతులు దులుపుకున్నారు. రోజుల వ్యవధిలోనే మంగళవారం రోడ్డుపైకి మురుగు నీరు వరదలా చేరింది.దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసనతో ముక్కు మూసుకుని మురుగునీటిలో రాకపోకలు చేయాల్సి వచ్చింది. ఆ ప్రాంతంలో ప్రార్థనా మందిరం, హాస్పిటల్స్,చిన్నపిల్లల పాఠశాలలు, కళాశాల ఉంది.ఈ ప్రాంతంతో నిత్యం రాకపోకలతో రద్దీగా ఉంటుంది. వర్షం కురిస్తే అక్కడ పరిస్థితి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత మరమ్మతులకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

లూథరన్ చర్చి ఎదుట రోడ్డుపై చేరిన మురుగునీరు

మసీద్ సెంటర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్అన్సారియా, ఏడీ అర్చన

వికలాంగులకు నియామక పత్రాలు అందజేత

అభినందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బ్యాక్ లాగ్ పోస్టులలో 16 మంది వికలాంగులకు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా నియామక ఉత్తర్వులు అందజేశారు. మంగళ వారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన కార్యక్ర మంలో 2021-22 సంవత్సరానికి గ్రూప్-4 అంధుల విభాగంలో జూనియర్ అసిస్టెంట్ 2 పోస్టులకు మాట్రన్ కం స్టోర్ కీపర్ ఒక పోస్టు కు నియామక ఉత్తర్వులు అందజేశారు. 2022-23 సంవత్సరానికి గ్రూప్-4 విభా గంలో బధిరులకు 1 జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, టెక్నికల్ పోస్టులకు, క్లాస్-4 విభాగం లో 10 పోస్టులకు అంధుల విభాగంలో ఆఫీస్ సబార్డినేట్ 2 పోస్టులు, వాచ్‌మెన్ 2 పోస్టులు, సేవిక 1 పోస్టు, బధిరుల విభాగంలో ఆఫీస్ సబార్డినేట్ 1 పోస్టు, శారీరక అంగ వైకల్యం విభాగంలో ఆఫీస్ సబార్డినేట్ 1 పోస్టు, కామాటి 1 పోస్టుకు ఎంపికైన అభ్యర్థులకు కలెక్టర్ నియామక పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి. అర్చన, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ రేపటికి వాయిదా

ఘర్షణ వాతావరణంతో గందరగోళం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఎస్‌జిటీల బదిలీల అంశంలో అభ్యం తరాలు తలెత్తడంతో కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహించకుండా ఉపాధ్యాయ సంఘాలు మంగళవారం నాడు అడ్డుకున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి కౌన్సిలింగ్ నిర్వహిం చాలని అన్ని ఉపాధ్యాయ సంఘాలు పట్టు బట్టగా, ప్రిఫరెన్షియల్ కోటాలో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయినికి న్యాయం చేయా లని మరో ఉపాధ్యాయ సంఘం పట్టుబట్ట డంతో కౌన్సిలింగ్ చేపట్టిన పాత జడ్పీ కార్యా లయ వాతావరణం వేడెక్కింది. బుధవారం మాన్యువల్ కౌన్సిలింగ్ కు సీనియారిటీ జాబితా నుంచి ఒకటి నుంచి 350 వరకు ఉన్న ఉపాధ్యాయులను కౌన్సిలింగ్ హాజరు కావాలని డీఈవో సమాచారం ఇవ్వడంతో పాత జడ్పీ కార్యాలయం ఉపాధ్యాయులు, వారి అనుయాయులతో కిక్కిరిసిపోయింది. సాంకేతిక కారణాల వల్ల ఆలస్యంగా ప్రారం భమైన కౌన్సెలింగ్ ప్రక్రియను ఉపాధ్యాయ సంఘాల నడుమ జరిగిన వివాదాల నేప థ్యంలో అధికారులు నిలిపివేశారు. నాగులుప్పలపాడు మండలంకు చెందిన ఒక ఉపాధ్యాయని ప్రిఫరెన్షియల్ కోటాలో 2017 లో ఉపయోగించిన మెడికల్ సర్టిఫికెట్ తో మరోసారి అదే కోటా లో అప్లై చేశారు. ఈ అంశాన్ని ముందుగా గుర్తించిన యుటిఎఫ్ నాయకులు సిఎస్‌ఇకి ఫిర్యాదు చేశారు. సీరి యల్ నంబర్ 148 వరకు జరపాలని హాజ రైన ఉపాధ్యాయులు, కొన్ని సంఘాలు పట్టు బట్టాయి. దీంతో ఘర్షణ పరిస్థితులు చోటు చేసుకున్నాయి. తీవ్ర ఘర్షణ వాతావరణం చోటు చేసు కోవడంతో కౌన్సెలింగ్ ప్రక్రియను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ఈవో ప్రకటించారు. ఇక్కడ నెలకొన్న పరిస్థితి గురించి విద్యాశాఖ కమిషనర్‌కు డీఈఓ కిరణ్ కుమార్ ఫోన్ ద్వారా వివరించారు.

గందరగోళంగా మారిన కౌన్సెలింగ్

పటిష్టంగా ఇళ్లపట్టాల రీవెరిఫికేషన్

- వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి
- కలెక్టర్లకు సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఇళ్ళ పట్టాల రీవెరిఫికేషన్ ప్రక్రియను పటిష్టంగా చేపట్టడంతో పాటు నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి, జిల్లా కలెక్టర్లకు సూచించారు. మంగళవారం విజయవాడ సిసిఎల్ఏ కార్యాలయం నుంచి సిసిఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, వర్చువల్‌గా జిల్లాల కలెక్టర్లతో సమావేశమై పిజిఆర్ఎస్ లో వచ్చిన పెండింగ్ దరఖాస్తులు, ఐవిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్, ఇంటి పట్టాల రీవెరిఫికేషన్ ప్రక్రియ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాల్లో పిజిఆర్ఎస్ లో రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా దరఖాస్తులను, సమస్యలను పెండింగ్ లో లేకుండా సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. పిజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీలను గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్ లైన్ లో అప్ లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఒంగోలు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాల కృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి. చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్ పాల్గొన్నారు.

ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే..

యోగాంధ్ర పేరుతో కాలక్షేపమా..?

- అభద్రతాభావంలో నిరుద్యోగులు
- పాలకపక్షాలకు రాజకీయ చిత్తశుద్ధి అవసరం
- మీడియా సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రజలందరూ సమస్యలతో సతమతమవు తున్నారని, పొగాకుకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్నారని, నిరుద్యోగం, ఉపాధి, కనీస వేతనాల వంటి సమస్యలు ప్రజలను వెంటాడుతుంటే.. యోగాంధ్ర పేరుతో కాలక్షేపం తగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హితవు పలికారు. మంగళవారం నాడు జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి సంతనూతలపాడు మండలం, మైనంపాడు గ్రామాన్ని సందర్శించారు. అనంతరం ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాస్తవానికి శ్రమజీవులకు యోగాతో పనిలేదని, వారికి శ్రమకు తగ్గ ఫలితం పొందినప్పుడే మానసిక ప్రశాంతత పొందుతారని పేర్కొన్నారు. తాను సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామాన్ని సందర్శించగా ఉదయం 6:30 గంటలకే ఉపాధి కూలీలు ఐదు కిలోమీటర్ల పనికి కాలి నడకన వెళ్లారని, మరికొందరు అడ్డా కూలీలు 7 గంటలకల్లా క్యారేజీలు సర్దుకుని ఒంగోలు బయలుదేరారని చెప్పారు. ప్రభుత్వానికి నిజంగా ప్రజలపై ప్రేమ ఉంటే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామ ఎస్సీ కాలనీలో సుమారు 100 మందికి పైగా ఇంటర్, బీటెక్ వంటి చదువులు చదివితే కేవలం ఐదు మంది మాత్రమే ఉద్యోగాలు పొందారని, మిగిలినవారు ఉద్యోగాలు లభించక నిరుద్యోగులుగా మిగిలారన్నారు. నిరుద్యోగులు అభద్రతాభావంతో ఉన్నారన్నారు. యోగాకు తాము వ్యతిరేకం కాదని అవసరమైతే గ్రామగ్రామానికి యోగా కేంద్రాలు ఏర్పాటు చేసి అవసరమైన శిక్షకులను నియమిస్తే నిరుద్యోగ సమస్య కూడా పరిష్కారమవుతుందని చెప్పారు.

కార్పొరేట్ కంపెనీలకు దాతృత్వం ఉంటే.. గత ఏడాది లాభాలు పొందిన జిపిఐ, ఐటిసి వంటి కంపెనీలు పొగాకు కొనుగోలు చేయొచ్చు కదా.? అని ప్రశ్నించారు. గత ఏడాది లాభాలు పొందిన కంపెనీలు ఈ సంవత్సరం రైతాంగం నుండి మొత్తం ఊడ్చేసే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. కార్పొరేట్ల మెడలు వంచే పని ఈ ప్రభుత్వం చేసే పరిస్థితి లేదన్నారు. కార్పొరేట్లను అదుపుచేయలేని అసమర్థ ప్రభుత్వం అని దుయ్యబట్టారు. పాలకపక్షాలకు రాజకీయ చిత్తశుద్ధి అవసరమని, సాక్షి మీడియా అంశంపై ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు స్పందించారు. గత కొంత కాలంగా రాజకీయాల్లోకి మహిళల ప్రస్తావన తేవడం, వారిపట్ల జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. మహిళలను అవమానకరంగా చేసిన వ్యాఖ్యలను తాము ఖండించామని, ఇటువంటి వ్యాఖ్యలు ఏ రాజకీయ పార్టీ గానీ, వ్యక్తులు గానీ చేయడం క్షమార్హం కాదన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె.మాబు మాట్లాడుతూ జిల్లాలో పొగాకుపై లక్షలాది కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, ప్రభుత్వం ఎస్టిసి, మార్క్‌ఫెడ్‌ను రంగం లోకి దింపి కొనుగోలు చేయించి పొగాకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 1.14 లక్షల హెక్టార్ల బంజరు భూములున్నాయని,7 ప్రాంతాల్లో 5 వేల ఎకరాలు ఆదానీ కంపెనీకి కట్టబెట్టారని, అవే భూములు రైతులకు అందిస్తే వేల కుటుంబాలు ప్రయోజనం పొందుతాయన్నారు. కాగా పొగాకు సమస్యను ప్రభుత్వం పరిష్కరించకపోతే రైతులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జివి కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న అధికారులు

ఉపాధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని నర్సాయిపాలెం, బోయలపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి (నరేగా) పనులను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన ఉన్నతాధికారులు విస్తృతంగా తనిఖీలు చేశారు. గ్రామ అభివృద్ధి పనుల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ఈ పర్యటనలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ నుండి వచ్చిన డిప్యూటీ, జాయింట్ డైరెక్టర్ ఉమేశ్ కుమార్ రామ్, అకౌంట్స్ ఆఫీసర్ (రూరల్ లైవ్‌లిహుడ్) జిఎస్. రావత్ పాల్గొన్నారు. వారితో పాటు ఈజీఎస్ డైరెక్టర్, కమిషనర్ (పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి), తాడేపల్లికి చెందిన షణ్ముఖ్ కుమార్, జిల్లా డ్వామా పీడీ జె జోసెఫ్ కుమార్, ఏపీడీ నిర్మలాదేవి, హౌసింగ్ డీఈ సురేష్‌బాబు, ఎంపిడివో బండారు శ్రీనివాసులు, ఐటిడిఏ స్పెషల్ ఆఫీసర్ కె నాగేశ్వరరావు, ఉపాధి ఏపీవో ఎం శైలజ ఈ పర్యటనలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధుల ద్వారా చేపట్టిన పలు ముఖ్యమైన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం అధికారులు కూలీలతో ప్రత్యక్షంగా సమావేశమై వారి అభిప్రాయాలు, కష్టనష్టాలు తెలుసుకున్నారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉపాధి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్

ఒంగోలులో ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర మహాసభలు

జులై 15, 16 తేదీల్లో నిర్వహణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆలిండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) రాష్ట్ర మహాసభలు జులై 15, 16 తేదీల్లో ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు ఆల్‌ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ తెలిపారు. సోమవారం నాడు ఒంగోలు, సిఐటియు కార్యాలయంలో ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్, ప్రకాశం జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. తంబి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ ఒంగోలులో నిర్వహించే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కార్మిక వర్గాన్ని కోరారు. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత రవాణా రంగం చాలా కీలకమైనదన్నారు. కేంద్ర ప్రభుత్వం రవాణా రంగాన్ని చిన్నచూపు చూస్తోందని, నిధులు కేటాయించడంలో చాలా వివక్షత పాటిస్తోందని ఆరోపించారు.

సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ జులై 9న జరిగే సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ సిఐటియు అఖిలభారత మహాసభలు 2025 డిసెంబర్ 31 ప్రారంభమై 2026 జనవరి 4వ తేది దాకా విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అఖిలభారత మహాసభల్లో రవాణా రంగం పాత్ర ఒక కీలకమైన పాత్రగా ఉండాలని కోరారు. ఎన్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగానికి సరైన నిధులు కేటాయించకుండా ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పే విధంగా విధానాలు ఉన్నాయని తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి.కొండారెడ్డి మాట్లాడుతూ మహాసభల నిర్వహణకు సిఐటియు తోడ్పాటునందిస్తుందని తెలిపారు. ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో టోల్ ప్లాజా కార్మికుల బకాయిల కోసం జనవరి నుంచి మే నెల వరకు పోరాటం చేసి విజయం సాధించినట్లు తెలిపారు. సమావేశంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు అల్లడి సుబ్బారావు, మహమ్మద్ హుస్సేన్, పిచ్చిరెడ్డి, బ్రహ్మయ్య, మహేష్, కాశీ విశ్వనాథం, కోటేశ్వరరావు, సయ్యద్ మున్నాబాషా తదితరులు పాల్గొన్నారు.